క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు


గాయపడిన గంగాదేవి


స్కూటర్‌ను ఢీకొట్టిన లారీ

వల్లూరు : మండలంలోని కుమారునిపల్లె క్రాస్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ గాయపడింది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. కుమారునిపల్లెకు చెందిన గంగాదేవి ఇంటి నుండి ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తూ ప్రధాన రహదారిని దాటుతుండగా కడప వైపు నుండి వచ్చిన లారీ ఢీ కొట్టింది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స కోసం ఆమెను 108 వాహనంలో కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

పులివెందులలో విద్యార్థులకు..

పులివెందుల రూరల్ : పట్టణంలోని నూతన ఆర్టీసీ బస్టాండు సమీపంలో బుధవారం పాఠశాలకు వెళ్తున్న విద్యార్థుల ఆటో ఎదురుగా స్కూటర్‌ను తప్పించబోయి బోల్తా పడింది. ఈ ఘటనలో విద్యార్థులకు గాయాలయ్యాయి. గాయపడిన విద్యార్థులను స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. విద్యార్థులను మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పరామర్శించారు.

కొండాపురంలో..

కొండాపురం : మండలంలోని గండ్లూరు గ్రామానికి చెందిన గంగారాజు బుధవారం ద్విచక్ర వాహనంలో ముద్దనూరుకు వెళుతుండగా చౌటిపల్లె వద్ద ద్విచక్రవాహనంను గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో గాయపడ్డాడు. తాడిపత్రి ఆసుపత్రికి తరలించి మేరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు.

అగ్నిప్రమాదం

వేంపల్లె : మండలంలోని తువ్వపల్లిలో చప్పిడి శ్రీను ఇంటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగినట్లు అగ్నిమాపక శాఖాధికారి శివరామిరెడ్డి తెలిపారు. బుధవారం మధ్యాహ్నం శ్రీనుకు చెందిన పాత ఇంట్లో విద్యుత్ షాక్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరగడంతో సమాచారం మేరకు వెళ్లి మంటలు ఆర్పి వేశామన్నారు. ఇంట్లో ఉన్న మంచాలు, కుర్చీలతోపాటు ఇతర వస్తువులు మంటల్లో కాలిపోయాయని, దాదాపు రూ.40వేలు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు.


ప్రవీణ్ మరణంపై విచారణ చేపట్టాలి

జమ్మలమడుగు : రాజమండ్రి పట్టణానికి చెందిన పాస్టర్ పగడాల ప్రవీణ్ మరణంపై పోలీసుశాఖ సమగ్ర విచారణ చేపట్టాలని పాస్టర్ల సంఘం డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పట్టణంలోని జెఎస్ఎఫ్ఎం చర్చిలో నిర్వహించిన సమావేశంలో పాస్టర్ బత్తుల మాట్లాడుతూ పాస్టర్‌ది సహజ మరణం కాదని ప్రభుత్వం, పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి నిజంగా హత్య జరిగినట్లు అయితే నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు పాల్గొన్నారు.

నేడు ఉపసర్పంచ్ ఎన్నికలు

ఎర్రగుంట్ల : మండలంలోని తుమ్మలపల్లి, సిర్రాజుపల్లి గ్రామాలలో ఉప సర్పంచ్‌ల ఎన్నిక గురువారం ఆయా గ్రామ సచివాలయాలలో జరుగుతుందని ఎంపీడీఓ వెంకటరమణ్య బుధవారం తెలిపారు. తుమ్మలపల్లిలో 10 మంది వార్డు మెంబర్లు, సిర్రాజుపల్లిలో 10 మంది వార్డు మెంబర్లు ఉన్నారన్నారు. వీరు ఆయా గ్రామాలకు చెందిన ఉపసర్పంచ్‌లను ఎన్నుకోవాల్సి ఉందన్నారు.

పిల్లలకు టీకాలు తప్పకుండా వేయాలి


సిబ్బందికి సూచనలు ఇస్తున్న జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి ఉమామహేశ్వర్‌కుమార్

ఎర్రగుంట్ల : చిన్న పిల్లలకు తప్పకుండా టీకాలు వేయాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఉమామహేశ్వర్‌కుమార్ తెలిపారు. బుధవారం చిలంకూరు పీహెచ్‌సీని ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే నిడుజివ్వి, చిలంకూరు-2 గ్రామ సచివాలయాలను తనిఖీ చేసి అక్కడ ఉన్న సిబ్బందికి తగు సూచనలు అందించారు. ఐసెపాక్స్ కండిషన్‌లో పెట్టుకోవాలన్నారు. పిల్లలకు టీకాలు వేయాలన్నారు. తర్వాత పీహెచ్‌సీలోని రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ గణేష్ కుమార్ రెడ్డి, సీహెచ్‌ఓ మునిరెడ్డి, హెల్త్‌ఎడ్యుకేటర్ నాగమునిరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

సింహాద్రిపురం : మండలంలో పనిచేస్తున్న పంచాయతీల కార్యదర్శి రాష్ట్ర పంచాయతీ రాజ్ అసోసియేషన్ వారి నూతన కార్యవర్గ ఎన్నిక బుధవారం ఎంపీడీవో కృష్ణమూర్తి అధ్యక్షతన ఎన్నుకున్నారు. ఈ నూతన కార్యవర్గ ఎన్నికైన వారు గౌరవ అధ్యక్షుడిగా వెంకటరాముడు, అధ్యక్షుడిగా వెంకటసుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడిగా రాజేష్, మహిళా అధ్యక్షురాలుగా ప్రశాంతి, కోశాధికారిగా అరుణ్‌కుమార్, జనరల్ సెక్రటరీగా బి.రాజేష్, అదనపు సెక్రటరీగా లక్ష్మీరెడ్డి, గౌరవ సలహాదారుడుగా జి.ప్రతాప్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ ఏవో శ్రీనివాస్‌రెడ్డి, అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆదాయం తక్కువ.. ఖర్చు ఎక్కువ

- పేరుకపోయిన పన్నుల బకాయిలు

జమ్మలమడుగు : అప్‌గ్రేడ్ నగరపంచాయతీలో ప్రజలనుంచి వచ్చే ఆదాయం కంటే ఖర్చులు ఎక్కువ వస్తున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా పట్టణంలో అక్రమ కులాయి కనెక్షన్‌ల ద్వారా మున్సిపాలిటీకి రావలసిన ఆదాయానికి తీవ్ర గండి పడుతోంది. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 20 వార్డులు ఉండగా అందులో 11,800 గృహాలు ఉన్నాయి. 52,800 మంది ప్రజలు ఉండగా, 44 వేల మంది ఓటర్లు ఉన్నారు.

మున్సిపాలిటీలో పేరుకపోయిన బకాయిలు..

మున్సిపాలిటీ పరిధిలో ప్రాపర్టీ ట్యాక్స్ కింద ప్రతి ఏడాది రూ.3.67 కోట్లు రావలసి ఉండగా ఇప్పటి వరకు రూ.2.31 కోట్లు ప్రజల నుంచి వసూలైంది. ఇంకా రూ. కోటి 36 లక్షలు రావలసి ఉంది. అలాగే వాటర్ ట్యాక్స్ ద్వారా రూ.2.47 కోట్లు వసూలు కావలసి ఉంది. ఇప్పటి వరకు కేవలం రూ.84 లక్షలు మాత్రమే వసూలైంది. ఇంకా రూ. కోటి అరవై లక్షలు వసూలు కావలసి ఉంది. పట్టణంలో


జమ్మలమడుగులోని మున్సిపల్ కార్యాలయం

ఎక్కువగా బకాయిలు ఉన్నది పెద్దతలకాయలని అధికారులు గుర్తించారు. అందులో ప్రధానంగా పెద్దపసుపల రహదారిలో ఒ వ్యక్తి అత్యధికంగా రూ. 4,51,000 బకాయి, రామిరెడ్డిపల్లె రహదారిలో మరోకరు రూ.1,86,000, నాగులకట్ట ప్రాంతంలో రూ. 1,19,000, గాయత్రినగర్ ప్రాంతంలో రూ.80,000. ఇంకా చాలా మంది 2007 నుంచి ఇప్పటి వరకు ప్రాపర్టీ, నీటి పన్నులు చెల్లించకుండా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరి ఇళ్ల వద్ద పన్నులు చెల్లించేటందుకు ఇంటి ముందు డప్పు వాయించే కార్యక్రమాన్ని నిర్వహించేందుకు చర్యలు తీసుకోబోతున్నారు.

మున్సిపాలిటీలో రెండువేలకు పైగా అక్రమ నీటి కులాయి కనెక్షన్లు..

మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 14,000 ఇళ్లు ఉండగా అందులో 3000 వరకు అక్రమ కులాయి కనెక్షన్లు ఉన్నట్లు మున్సిపాలిటీ అధికారులు గుర్తించారు. ఇప్పటి వరకు 400 అక్రమ కులాయి కనెక్షన్లు క్రమబద్ధీకరణ చేశారు. ఇంకా 2500లకు పైగా అక్రమ కులాయి కనెక్షన్లు ఉన్నాయని వాటిపై దృష్టిపెడుతున్నామని మున్సిపాలిటీ అధికారులు పేర్కొంటున్నారు. ఈ అక్రమ కులాయి కనెక్షన్లను క్రమ బద్ధీకరణ జరిగితే మున్సిపాలిటీకి ప్రతి ఏడాది రూ.2 కోట్లు ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు.

అక్రమ కనెక్షన్లతో ఏడాదికి రూ.2 కోట్ల ఆదాయం కోల్పోతున్నాం



మున్సిపాలిటీ పరిధిలో 3000 వరకు అక్రమనీటి కులాయి కనెక్షన్లు ఉండటంతో ఏడాదికి రూ. 2 కోట్లు ఆదాయం మున్సిపాలిటీ నష్టపోతుంది. వీటిని క్రమబద్ధీకరణ చేయబోతున్నాం. ఇప్పటి వరకు 400 కులాయి కనెక్షన్లు క్రమబద్ధీకరణ చేశాము. ప్రజలు కూడా ఏప్రిల్ చివరి నాటికి నీటి కులాయిలు క్రమబద్ధీకరణ చేసుకోవాలి. లేకుంటే కఠినంగా కులాయి కనెక్షన్లు తొలగించడం జరుగుతుంది.

– వెంకట్రామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, జమ్మలమడుగు


పట్టణంలో కులాయి కనెక్షన్లు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది(ఫైల్)

విద్యుత్ తీగలను తక్షణమే తొలగించాలి


మసీదు భవనంపై ఉన్న విద్యుత్ తీగలను పరిశీలిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : మసీదు భవనంపై వెళ్లిన ప్రమాదకర విద్యుత్ తీగలను తక్షణమే తొలగించాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి విద్యుత్ అధికారులకు సూచించారు. బుధవారం పట్టణంలోని స్థానిక చెన్నారెడ్డి కాలనీలో ఉన్న మసీద్ భవనంపై అత్యంత ప్రమాదకర స్థాయిలో తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు ఆయన మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రంజాన్ పండుగను పురస్కరించుకుని తక్షణమే విద్యుత్ తీగలను తొలగించాలని విద్యుత్ అధికారులకు ఫోన్ చేసి తెలిపారు.

కూలీల సంఖ్య పెంచండి


ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ జ్యోతి

కమలాపురం : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ జ్యోతి తెలిపారు. బుధవారం ఆమె లేటపల్లెలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. కూలీలకు ఓఆర్ఎస్ పాకెట్లు, ప్రథమ చికిత్స పెట్టెలను అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కూలీల సంఖ్యను పెంచి టార్గెట్ పూర్తి చేయాలన్నారు. అలాగే రూ.300 కూలీ డబ్బులు పడే విధంగా మార్కింగ్ ఇచ్చి పనులు చేయించాలని ఎఫ్ఏలను ఆదేశించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి తిరిగి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయరాదని, తడి, పొడి చెత్తను వేరు వేరుగా ఉంచి మీ ఇంటి వద్దకు వచ్చిన హరిత రాయబారులకు ఇవ్వాలన్నారు. అలాగే ప్లాస్టిక్ వాడకాన్ని 100 శాతం నిషేధించాలన్నారు. అనంతరం సచివాలయంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీఓ పార్థసారధి, పంచాయతీ కార్యదర్శి అబ్దుల్, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

ఏప్రిల్ 1 నుంచి సదరం స్లాట్స్ ప్రారంభం

కమలాపురం : ఏప్రిల్ 1వ తేదీ నుంచి సదరం స్లాట్స్ పునఃప్రారంభం కానున్నట్లు ఎంపీడీఓ జ్యోతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగుల పెన్షనర్ల వెరిఫికేషన్ కారణంగా జనవరిలో విడుదల కావాల్సిన సదరం స్లాట్స్ నిలిపివేయబడ్డాయని ఆమె తెలిపారు. దివ్యాంగ సంఘాల విజ్ఞప్తుల మేరకు వెరిఫికేషన్‌తో పాటు స్లాట్స్ తిరిగి ప్రారంభించి, అర్హులైన వారికి సర్టిఫికెట్లు అందజేస్తామని ఆమె తెలిపారు. ఈ స్లాట్స్ ఎంపిక చేసిన ఏరియా, జిల్లా, టీచింగ్ ఆసుపత్రులు, జీజీహెచ్‌లలో ప్రతి మంగళవారం అందుబాటులో ఉంటాయన్నారు. ఏప్రిల్ 1 2025 నుంచి అందుబాటులోకి వస్తాయని తెలిపారు. మండలంలోని దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డికి మాతృ వియోగం


లక్ష్మీనరసమ్మ(ఫైల్)

వేంపల్లె : వేంపల్లె జెడ్పీటీసీ సభ్యులు ఎం.రవికుమార్‌రెడ్డికి మాతృ వియోగం కలిగింది. కొద్దిరోజులుగా తీవ్ర అస్వస్థతతో బాధపడుతున్న తల్లి మాచిరెడ్డి లక్ష్మీనరసమ్మ(84) బుధవారం కడపలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో కన్నుమూశారు. లక్ష్మీనరసమ్మ భౌతిక కాయాన్ని స్వగృహమైన వేంపల్లె మండలం గిడ్డంగివారిపల్లె గ్రామానికి తరలించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

పోట్లదుర్తిలో పనిచేయని ఏటీఎం



పనిచేయని ఎస్‌బీఐ ఏటీఎం

ఎర్రగుంట్ల : మండలంలోని పోట్లదుర్తి గ్రామంలో ఎస్‌బీఐ ఏటీఎం కొన్ని నెలలుగా పనిచేయలేదని గ్రామ ప్రజలు వాపోతున్నారు. పండుగలు దగ్గర పడుతుండటంతో పండుగ ఖర్చుల కోసం నగదు కావాలంటే ఏటీఎం పనిచేయక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి ఏటీఎం పనిచేసేవిధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పంట నమోదు రశీదులను పొందాలి

వీరపునాయునిపల్లె : 2024–25 రబీ సీజన్‌కు సంబంధించి పంటలు సాగుచేసి పంట నమోదు చేయించుకున్న ప్రతి రైతు రశీదు పొందాలని మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు తెలిపారు. బుధవారం తలపనూరు గ్రామంలోని రైతు సేవా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. మండలంలోని 15 రైతు సేవా కేంద్రాల పరిధిలో 6,670 మంది రైతులు 25,404 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారని ప్రతి పంటను నమోదు చేశామని తెలిపారు. 99.70 శాతం ఈకేవైసీ చేయించామన్నారు. రైతులందరూ రైతు సేవా కేంద్రానికి వెళ్లి రశీదులను పొందాలన్నారు. విశిష్ట గుర్తింపు కార్డుల కొరకు 5,683 మంది రైతులు నమోదు చేసుకున్నారన్నారు. ఎవరైనా నమోదు చేయించుకోకుండా ఉంటే వెంటనే మీ గ్రామంలోని రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించాలన్నారు. అనంతరం రైతులకు పంట నమోదు వివరాలకు సంబంధించిన రశీదులను అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాకులు, రైతులు పాల్గొన్నారు.

చెత్త సేకరణతో పల్లె ప్రగతి సాధ్యం

వల్లూరు (చెన్నూరు) : గ్రామంలో ప్రతి ఇంటి నుండి చెత్త సేకరణ సక్రమంగా జరిగినట్లయితే పల్లె ప్రగతి సాధ్యమవుతుందని ఎంపీడీఓ కిరణ్‌మోహన్ రావు తెలిపారు. ముండ్లపల్లి గ్రామపంచాయతీలో బుధవారం ఆయన చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు.

హరిత రాయబారులు ప్రతిరోజు చెత్త సేకరణ చేయాలన్నారు. అలాగే చెత్త వ్యర్థ పదార్థాలను తడి చెత్త, పొడి చెత్తను వేరువేరుగా బుట్టలలో నింపాలన్నారు. వేరు చేసిన చెత్తను హరిత రాయబారుల ద్వారా వర్మీ కంపోస్టుకు చేర్చి ఎరువులు తయారు చేయడం జరుగుతుందన్నారు. అలాగే తయారుచేసిన ఎరువును తక్కువ ధరలకే రైతులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకున్నట్లయితే ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చు అన్నారు. అనంతరం ఉపాధి హామీ పనులను పరిశీలించి మస్టర్ తనిఖీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, హరితరాయబారులు పాల్గొన్నారు.

యువత డ్రగ్స్ బారిన పడవద్దు


డ్రగ్స్ రహిత సమాజంపై ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్

పులివెందుల రూరల్ : యువత డ్రగ్స్ బారిన పడకుండా సమయాన్ని సద్వినియోగం చేసుకుని భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని జెఎన్‌టీయూ కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ తెలిపారు. బుధవారం పట్టణంలోని జెఎన్‌టీయూ కళాశాలలో మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు కళా జాగృతి బృందం వారిచే సే నోట్ టు డ్రగ్స్ సేవ్ యువర్ లైఫ్ అంటూ మత్తు పదార్థాలపై నాటిక, పాటల రూపంలో అవగాహన కల్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మత్తు పదార్థాలను, డ్రగ్స్ భూతాన్ని తరిమి కొడతాం, డ్రగ్స్ రహిత సమాజం, సమాజ సంక్షేమం దిశగా పయనిద్దామని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులచే మత్తు పదార్థాల జోలికి వెళ్లమని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్ఐ నారాయణ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శేషమహేశ్వరమ్మ, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది, కళా జాగృతి బృందం, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ముస్లిం సోదరుల ఆత్మీయ ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులతో మున్సిపల్ చైర్మన్, తదితరులు

పులివెందుల : పట్టణంలోని శ్రీరామ థియేటర్ వద్ద ఉన్న పాత ఈద్గా ఆతిక్ మసీద్‌లో బుధవారం జిల్లా వైసీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ నూరుల్లా ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూరుల్లా మాట్లాడుతూ ముస్లిం సోదరుల ఆత్మీయ ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ ఇంచార్జ్ వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, పులివెందుల పట్టణ వైకాపా కన్వీనర్ హాల్ గంగాధర్‌రెడ్డి, కౌన్సిలర్ పార్నపల్లి కిశోర్‌లు తదితరులు హాజరయ్యారు. వైఎస్ మనోహర్‌రెడ్డి ప్రతి ఒక్క ముస్లిం సోదరులకు సోదరీమణులకు ముందస్తు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆతిక్ మసీద్ కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలు ముత్తవళీలు, వైసీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అవలంబించాలి

కమలాపురం : రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని సాయిల్ టెస్టింగ్ ల్యాబ్ ఏడీఏ రాధాదేవి తెలిపారు. బుధవారం మండలంలోని టి.చదిపిరాళ్ల, రామచంద్రాపురం గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది... కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూముల సారవంతాన్ని పెంపొందించుకొనుటకు సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అవలంభించాలన్నారు. సేంద్రియ ఎరువులు, పచ్చి రొట్టె ఎరువులు, జీవన ఎరువులు, వర్మీ కంపోస్ట్ వాడకాన్ని పెంచాలన్నారు. కడప ఊటుకూరులోని భూసార పరీక్షా కేంద్రంలో ఉచితంగా భూసార, నీటి పరీక్షలను చేస్తారని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ల్యాబ్ ఏఓ సత్యాదేవి మాట్లాడుతూ మట్టి నమూనాలు పొలం నుంచి ఏ విధంగా సేకరించాలో వివరించారు. సూక్ష్మధాతు లోపాలను నివారించుటకు తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. మండల ఏఓ సరస్వతి మాట్లాడుతూ చిన్న సన్న కారు రైతులు ఉపాధి హామీ పథకం ద్వారా ఉచితంగా నీటి కుంటలను తవ్వించుకోవాలన్నారు. అనంతరం రైతులకు సాయిల్ హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆవుల మృతికి అధికారులే బాధ్యత వహించాలి

వేంపల్లె : పట్టణంలోని పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆవులు మృతి చెందుతున్నాయని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ ఆరోపించారు. వేంపల్లె పట్టణంలోని స్థానిక సాయిబాబా దేవాలయం ఎదురుగా ప్రమాదవ శాత్తు గోతిలో పడి మృతి చెందిన ఆవుకు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు దాదాపు పది ఆవులు మృతి చెందాయని, పలుమార్లు పంచాయతీ అధికారులకు విజ్ఞప్తి చేసిన పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయంగా ఉన్నాయని, వాటిని గోశాలలకు తరలించాలని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. జంతు సంరక్షణ చట్టం క్రింద ఆవులను విచ్చలవిడిగా వీధుల్లోకి తోలుతున్న వారిపై, పంచాయతీ అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, భవిష్యత్‌లో ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలన్నారు.

అవగాహన సదస్సు

వల్లూరు (చెన్నూరు) : ప్రతి మనిషికి ముఖ్యమైన నోరు, దంత సంరక్షణలపై అవగాహన సదస్సును ఎర్పాటు చేయడం జరిగిందని డాక్టర్ సతీష్‌కుమార్, డాక్టర్ ప్రశాంతిలు తెలిపారు. బుధవారం వరల్డ్ ఓరల్ హెల్త్ డే సందర్భంగా స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన సదస్సు ఏర్పాటుచేసి, స్థానిక కేటీఆర్ కాలనీలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నోరు శుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటారన్నారు. క్యాన్సర్ మూలకాలను నోటి ద్వారానే వస్తాయని కనుక నోటిని దంతాలను శుభ్రంగా ఉంచుకుంటే నోటి ద్వారా వచ్చే వ్యాధులను నివారించవచ్చునన్నారు. ఆసుపత్రికి వచ్చిన రోగులకు టూత్ పేస్టులు, మౌత్ వాష్ లు పంచి పెట్టారు. కార్యక్రమంలో డాక్టర్ హరీష్, డాక్టర్ శివశంకర్, హౌస్ సర్జన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

జమ్మలమడుగు : ప్రొద్దుటూరు మండలం చౌడూరు సమీపంలో ఉన్న పూజ ఇంటర్నేషనల్ స్కూల్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ నాయకుడు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఏఓ మనోహర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ పూజ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థిని పాఠశాలలో ఉన డీన్ పైపుతో కొట్టడంతో విద్యార్థితీవ్రంగా గాయపడ్డాడన్నారు. పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగింది. అయినా పాఠశాల యజమాన్యం డీన్‌పై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దారుణం అన్నారు. పాఠశాల యాజమాన్యం వాచ్‌మేన్లు చేయవలసిన పనులను విద్యార్థులతో చేయిస్తున్నారన్నారు. అధికారులు పాఠశాలపై చర్యలు తీసుకోవాలన్నారు.

రోడ్డు వెడల్పు పనులకు సహకరించండి


మార్కింగ్ పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్ హరినాథరెడ్డి

వేంపల్లె : వేంపల్లెలో చేపట్టే రోడ్డు వెడల్పు పనులకు కడప రోడ్డులో ఉన్న గృహ యాజమానులు సహకరించాలని తహసీల్దార్ హరినాథ్‌రెడ్డి కోరారు. బుధవారం స్థానిక నాలుగు రోడ్ల కూడలి నుండి పాత జిల్లా పరిషత్ బాలికల పాఠశాల రహదారి వరకు ఉన్న గృహాలకు రోడ్డు భవనాల శాఖ అధికారులు కొలతలు వేసి మార్కింగ్ వేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రోడ్డు భవనాల శాఖ అధికారులు మార్కింగ్ వేసిన వరకు గృహాలను యాజమానులు తొలగించాలని కోరారు. ప్రభుత్వం నష్టపరిహారం కూడా ఇచ్చిందన్నారు. గతంలో మార్కింగ్ వేసిన కొన్ని గృహాలు రోడ్డు పరిధిలోకి ఉన్నాయని, వాటిని కచ్చితంగా తొలగించాల్సిందేనన్నారు. త్వరితగతిన గృహ యాజమానులు మార్కింగ్ వేసిన చోటికి తొలగించి డ్రైయినేజీ పనులు జరిగేందుకు సహకరించాలని కోరారు. పండుగలు పూర్తి అయిన తర్వాత రోడ్డు పరిధిలో ఉన్న గృహ యాజమానులు వారి గృహాలను తొలగించి మరమ్మతులు చేసుకోవాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే మాత్రం అధికారులే తొలగించాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో రోడ్డు భవనాల శాఖ అధికారులు మనోహర్‌రెడ్డి, గణేష్‌రెడ్డి, సర్వేయర్లు, ఆర్ఐ లోకేష్, రోడ్డు భవనాల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి

వేంపల్లె : పిల్లల్లో నైపుణ్యాభివృద్ధే లక్ష్యంగా అంగన్‌వాడీ టీచర్లు పని చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగ సుభాషిణి, సుభద్రలు తెలిపారు. బుధవారం వేంపల్లెలోని ఉర్దూ పాఠశాలలో చక్రాయపేట మండలంలోని ఆయా గ్రామాల్లో పని చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు పులివెందుల ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పోషణ్ భీ - పడాయిభీ అనే వాటిపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ వ్యవస్థ ద్వారా ఇటు పిల్లల్లోనూ, గర్భిణీల్లోనూ పోషకాలతో కూడిన ఆహారంతోపాటు వారి జీవన విధానంలో మార్పులు తెచ్చేలా ప్రభుత్వాలు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. పిల్లల ఆకర్షించేలా ఆట పాటలతో విద్యను నేర్పించాలని, బాల్య వివాహాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి చిన్నారికి ప్రతిరోజూ కనీసం రెండు గంటల పాటు నాణ్యత గల ప్రీ-స్కూల్ బోధన అందించాలనే లక్ష్యంతో ఈ శిక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమం కొత్త విద్యా విధానం యొక్క సూత్రాలకు అనుగుణంగా, మాతృభాషలో విద్యకు ప్రాధాన్యత ఇస్తుందని, భారతదేశంలో గ్రామీణ పిల్లల సంరక్షణ కేంద్రం అంగన్‌వాడీ కేంద్రాలు అన్నారు. ఆరు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ, పోషకాహారం, బాల్య విద్యను అందించడంలో అంగన్‌వాడీలు కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. కార్యక్రమంలో వేంపల్లె సూపర్ వైజర్ స్వర్ణలత అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.